Web & Epaper : www. aksharasodhana.com

# అక్షర శోధన

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం

తెలుగు దినపత్రిక

శుక్రవారం, 30 మే 2025 సంపుటి : 02 సంచిక : 95 పేజీలు : 4 వెల : 2/-

Web& Epaper : www. aksharasodhana.com

## రక్షణ కొనుగోళ్ల జాప్యంపై ఎయిర్ చీఫ్ మార్షల్ తీవ్ర ఆందోళన

**- సంతకాలు తప్ప ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కావడం లేదన్న అమర్ ప్రీత్ సింగ్**



**న్యూఢిల్లీ** దేశ రక్షణ రంగంలో కీలకమైన సేకరణ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కాకపోవడంపై భారత వైమానిక దళ ప్రధానాధికారి, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్వదేశీ పరిజ్ఞానంతో చేపడుతున్న ప్రాజెక్టులు ఆలస్యం అవుతుండటం పట్ల ఆయన అసంతృప్తి వెలిబుచ్చారు. "చాలాసార్లు, కాంట్రాక్టులపై సంతకాలు చేసేటప్పుడే ఆ వ్యవస్థలు ఎప్పటికీ మన చేతికి రావని మాకు తెలుస్తుంది. కాలపరిమితులు పెద్ద సమస్య. ఒక్క ప్రాజెక్టు కూడా సమయానికి పూర్తయినట్లు నాకు గుర్తులేదు. సాధించలేని దాని గురించి మనం ఎందుకు వాగ్దానం చేయాలి?"

2లో..

## పీఓకేపై కేంద్ర ప్రభుత్వం సంచలనం

**- భారత్ లో ఓ భాగమని తేల్చి చెప్పిన రాజ్ నాథ్ సింగ్**

**న్యూఢిల్లీ** జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రవాదుల దాడి అనంతరం భారత్– పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. యుద్ధ వాతావరణం కొనసాగుతోంది. పాకిస్తాన్ భూభాగంపై నుంచి చొరబాట్లు సైతం చోటు చేసుకుంటోండటంతో భారత ఆర్మీ అప్రమత్తంగా ఉంటోంది. రెప్ప వాల్చకుండా పహారా కాస్తోంది. ఈ పరిణామాల మధ్య రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ మరో సంచలన ప్రకటన చేశారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ పై కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో స్పష్టం చేశారు. పీఓకేలో నివసించే మెజారిటీ ప్రజలు భారత్ వైపు చూస్తోన్నారని, సత్సంబంధాలను కోరుకుంటోన్నారని అన్నారు. భారత్ తో తమకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు ప్రతి ఒక్క పాక్ ఆక్రమిత కాశ్మీర్ పౌరుడూ భావిస్తోన్నాడని అన్నారు. దేశ రాజధానిలో ఏర్పాటైన సీఐఐ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు రాజ్ నాథ్ సింగ్. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడారు. ఆపరేషన్ సింధూర్ అంశాన్నీ ప్రస్తావించారు. పాకిస్తాన్ తో తలెత్తిన ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యల గురించి వివరించారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రజలు భారత్ వైపే ఉన్నారని, వారిని కొంతమంది తప్పుదారి పట్టించారని, అలాంటి వాళ్ల వల్లే సమస్యలు ఉత్పన్నమౌతోన్నాయని రాజ్ నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. అక్కడ నివసిస్తోన్న భారత సోదరుల పరిస్థితి మహారాణా ప్రతాప్ తమ్ముడు శక్తి సింగ్ మాదిరిగానే ఉంటోందని పేర్కొన్నారు. భారతదేశం ఎప్పుడూ శాంతియుత వాతావరణాన్నే కోరుకుందని, ప్రజల మధ్య ప్రేమ, ఐక్యత ఏర్పడటానికి ప్రాధాన్యత ఇచ్చిందని వివరించారు. పాక్



ఆక్రమిత కాశ్మీర్ భారత్ లో ఓ భాగమని తేల్చి చెప్పారు రాజ్ నాథ్ సింగ్. తాను భారత్ లో విలీనం అయ్యానంటూ పీఓకే ప్రకటించుకునే రోజు ఎంతో దూరంలో లేదని తాను బలంగా నమ్ముతున్నానని చెప్పారు. భారత్ లో పాక్ ఆక్రమిత కాశ్మీర్ ఏకీకరణ ఈ దేశ సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక శ్రేయస్సుపై ఆధారపడి ఉంటుందని రాజ్ నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఉగ్రవాద కార్యకలాపాలను నిర్వహించడం ఎంత ప్రమాదకరమో పాకిస్తాన్ కు తెలిసి వచ్చి ఉంటుందని ఆయన అన్నారు. పాకిస్తాన్ దానికి తగిన భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వచ్చిందని, భవిష్యత్తులోనూ ఇలాంటి పరిస్థితి తలెత్తుతుందని ఆ దేశం గ్రహించిందని అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ వ్యూహాన్ని మార్చామని, ఉగ్రవాదులపై దాడులకు సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చామని

## ట్రంప్‌కు భయపడి యుద్ధం ఆపారు

**- మోదీ కాలం చెల్లిన రూపాయన్న సీఎం రేవంత్**

- ట్రంప్ బెదిరింపులకు మోదీ తలొగ్గారన్న రేవంత్ రెడ్డి
- పాక్‌తో యుద్ధం మధ్యలోనే ఎందుకు ఆపారంటూ నిలదీత
- ఇందిరమ్మ ధైర్యం మోదీలో లేదని విమర్శలు
- దేశ ఆత్మగౌరవాన్ని ట్రంప్ కాళ్ల దగ్గర పెట్టారంటూ ఆగ్రహం



**హైదరాబాద్** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి, పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ప్రధాని మోదీ అర్ధాంతరంగా నిలిపివేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. దేశ భద్రత విషయంలో ప్రధాని మోదీ తీరుపై పలు ప్రశ్నలు సంధించారు. గురువారం మేడ్చల్ నియోజకవర్గంలో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జై హింద్ యాత్ర' అనంతరం నిజాంపేటలో జరిగిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి తాము పూర్తిగా సహకరించాం. యుద్ధం చేయాలంటే ధైర్యం, వెన్నెముక, సరైన యుద్ధతంత్రం ఉండాలి. కేవలం నాలుగు రోజులు యుద్ధం చేసి, మధ్యలోనే ఎందుకు ఆపేశారో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. యుద్ధం ప్రారంభించే ముందు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం, యుద్ధాన్ని నిలిపివేసే సమయంలో ఎందుకు సంప్రదించలేదని ఆయన నిలదీశారు. "అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా ముందుకు వచ్చి యుద్ధం ఆపించానని ప్రకటించారు. ట్రంప్ బెదిరించగానే మోదీ ఎందుకు తలొగ్గారు? ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం, మీ సొంత వ్యవహారం కాదు. భారతీయుల ఆత్మగౌరవాన్ని ట్రంప్ దగ్గర తాకట్టు పెడతారా?" అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో ఇందిరా గాంధీ ప్రదర్శించిన ధైర్యాన్ని ప్రధాని మోదీ స్ఫూర్తిగా తీసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. "భారత్ వైపు కన్నెత్తి చూస్తే కనుగుడ్లు

2లో..

## తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక నియామకాలు

**- కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన**



**హైదరాబాద్** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కార్యకలాపాలను మరింత బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పలు ముఖ్యమైన కమిటీలను నియమిస్తూ ఏఐసీసీ గురువారం ఢిల్లీలో ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలు, పార్టీ వ్యూహరచన వంటి కీలక అంశాలను పర్యవేక్షించేందుకు 22 మంది సభ్యులతో రాజకీయ వ్యవహారాల కమిటీని ఏఐసీసీ నియమించింది. దీనితో పాటు, పార్టీకి దిశానిర్దేశం చేసేందుకు, కీలకమైన సలహాలు అందించేందుకు 15 మంది అనుభవజ్ఞులతో కూడిన సలహా కమిటీని కూడా ఏర్పాటు చేసింది. వీటితో పాటు, భవిష్యత్తులో చేపట్టబోయే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియకు సంబంధించి పార్టీ పరంగా వ్యవహారాలు చూసేందుకు ఏడుగురు సభ్యులతో డీలిమిటేషన్ కమిటీని నియమించింది. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'సంవిధాన్ బచావో ప్రోగ్రామ్'ను తెలంగాణలో సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు 16 మందితో ప్రత్యేక కమిటీని, పార్టీలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ఏవైనా ఉల్లంఘనలు జరిగితే చర్యలు తీసుకునేందుకు ఆరుగురు సభ్యులతో క్రమశిక్షణా చర్యల కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు ఏఐసీసీ తమ ప్రకటనలో స్పష్టం చేసింది.

## మన జెండా పీకేస్తాం అన్నోళ్లు అడ్రస్ లేకుండా పోయారు

**- మహానాడు చివరి రోజు నారా లోకేశ్ ప్రసంగం**

**కడప** తెలుగుదేశం పార్టీ జెండా పీకేస్తామని, పార్టీని లేకుండా చేస్తామని అన్నవారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కడపలో జరిగిన మహానాడు వేదికగా ఆయన మాట్లాడుతూ, వై నాట్ 175 అన్నవారికి ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎదుర్కొన్న సవాళ్లను, కార్యకర్తల త్యాగాలను స్మరించుకుంటూ, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రగతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తిరుమల తొలిగడప దేవుని కడప, ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం, అమీన్ పీర్ దర్గా, మరియాపురం చర్చి నెలకొన్న పుణ్యభూమి కడప. పౌరుషం, ఆత్మీయతలను కలగలిపి మహిళలను గౌరవించి గొప్పనేల కడప. కడప మాస్ జాతర మహానాడు అదిరిపోయింది. పౌరుషాల గడ్డపై పసుపు సైన్యం గర్జించింది, దేవుని గడప కడపలో పసుపు పండగ జరుపుకోవడం మన అదృష్టం. 2024లో మాస్ విక్టరీ సాధించాం, రికార్డులు బద్దలు కొట్టాం చరిత్రను తిరగరాసాం. 94 పర్సెంట్ స్ట్రైక్ రేట్...164 అవుటాఫ్ 175. ఇది కేవలం రికార్డ్ కాదు ఆల్ టైం రికార్డ్. ఇది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నాటుదెబ్బ. జెండా పీకేస్తాం అన్నారు, పార్టీ కార్యాలయానికి టు లెట్ బోర్డు పెట్టుకున్నారు.పార్టీ లేకుండా చేస్తామన్నోళ్లు అడ్రెస్స్ లేకుండా పోయారు. వై నాట్ 175 అన్నారు, ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. మన బొమ్మలు పెట్టి బాక్సింగ్ చేసారు, ఎన్నికల్లో ప్రజలు ఫుట్ బాల్ ఆడుకున్నారు. ఏ తప్పు చేయని మన అధినేతను అరెస్ట్ చేసారు, ప్రజలు వాళ్ళ నాయకుడిని ప్యాలస్ లో పెట్టి తాళం వేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి, గౌరవ మంత్రులు, గౌరవ ఎమ్మెల్యేలు, 82 బ్యాచ్ సీనియర్ నాయకుల దగ్గర నుండి 2025 బ్యాచ్ జూనియర్లకు, ప్రజలకు, అందరి కంటే ముఖ్యం, ఎత్తిన జెండా దించకుండా, మడమ తిప్పకుండా తెలుగుదేశం పార్టీకి కాపలా కాస్తున్నప్రాణసమానమైన కార్యకర్తలకు నా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.దేవునికడప సాక్షిగా



ఇక్కడి ప్రజలను నాలుగు ప్రశ్నలను అడగాలనుకుంటున్నా. 1). తల్లిని చెల్లిన మెడబట్టి బయటకు గెంటిదెవరు? 2). సొంత బాబాయిని గొడ్డలిపోటుతో లేపేసిందెవరు? 3). జె-బ్రాండ్స్ తో పేదల రక్తం తాగిందెవరు? 4). బల్లకింద రెడ్ బటన్ నొక్కి ప్రజలను బాదిందెవరు?

తెలుగు వారిని ప్రపంచ పటంలో

2లో..

## ఉమ్మడి వరంగల్ కలెక్టర్ల పనితీరుపై అసంతృప్తి

**- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ అనుమతుల్లో నిర్లక్ష్యం తగదన్న మంత్రి**



**హైదరాబాద్** ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ల పనితీరుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రజలకు అత్యంత కీలకమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అనుమతుల మంజూరు ప్రక్రియలో నిర్లక్ష్యం తగదని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని, జూన్ 6వ తేదీలోగా అర్హులైన వారి పూర్తి జాబితాను తయారు చేయాలని ఆయన గడువు విధించారు. కేవలం జాబితా మాత్రమే కాకుండా, సంబంధిత ప్రొసీడింగ్స్ కాపీలను కూడా జతచేసి అందించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. అదేవిధంగా, వ్యవసాయ సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతులను తీవ్రంగా నష్టపరిచే నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల బెడదపై కూడా మంత్రి దృష్టి సారించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు లేదా ఎరువులు విక్రయిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నకిలీ దందాను సమర్థవంతంగా అరికట్టేందుకు పోలీస్ శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

## ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

**- 3 రోజుల్లో ప్రభాకర్ రావు రాక**

హైదరాబాద్ తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపులు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరో చీఫ్ ప్రభాకర్ రావు ఇండియాకు రానున్నారు. ఆయన దాఖలు చేసుకున్న పిటిషన్‌ను జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మల బెంచ్ ఈ కేసును విచారించింది. ప్రభాకర్ రావు పాస్‌పోర్టు, గతంలో కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ పాస్ పోర్టును తిరిగి అతనికి అందజేయాలని కోర్టు ఆదేశించింది. పాస్‌పోర్టు అందిన మూడు రోజుల్లో ప్రభాకర్ రావు భారత్‌కు తిరిగి రావాలని కోర్టు ఆదేశించింది. అతను దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని, దర్యాప్తుకు పూర్తిగా సహకరించాలని సూచించింది. అదే సమయంలో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ప్రభాకర్ రావును అరెస్టు చేయవద్దని సుప్రీంకోర్టు తెలంగాణ పోలీసులకు ఆదేశించింది. దీంతో తాత్కాలికంగా అరెస్టు నుంచి తప్పించుకోవచ్చు. పాస్‌పోర్టు అందిన మూడు రోజుల్లో భారత్‌కు తిరిగి వస్తానని ప్రభాకర్ రావు కోర్టుకు అఫిడవిట్ రూపంలో రాతపూర్వక హామీ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టు 5కు వాయిదా వేసింది.సీనియర్ పోలీస్ ఆఫీసర్ అయిన ప్రభాకర్ రావు, గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వంలో రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్‌లను గా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 2024 మార్చిలో పంజాగుట్ట పోలీసులు ఈ కేసును నమోదు చేసిన తర్వాత, ప్రభాకర్ రావు అమెరికాకు వెళ్లిపోయారు. ఏడాదిన్నరగా అమెరికాలో ఉంటున్నారు. విచారణకు సహకరించకపోవడంతో ఆయనను ప్రకటిత నేరస్తుడిగా ప్రకటించడానికి అన్ని ఏర్పాట్లు అయిపోయాయి. పాస్ పోర్టు రద్దు చేశారు. డిపోర్టేషన్ ఏర్పాట్లు చేస్తున్నారు. తనకు రాజకీయ ఆశ్రయం కల్పించాలని అమెరికాలో ఆయన పెట్టుకున్న పిటిషన్లను అక్కడి కోర్టులు కొట్టేశాయి. దీంతో అన్ని దారులు మూసుకుపోయినట్లయింది.చివరికి తన పాస్ పోర్టు ఇప్పిస్తే తానే వస్తానని పాస్ పోర్టు ఇచ్చిన మూడు రోజుల్లో ఇండియాకు వస్తానని



చెప్పి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.

2లో..

## రేషన్ డీలర్లూ.. నమ్మకాన్ని నిలబెట్టండి

**- కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్న మంత్రి నాదెండ్ల**

**అమరావతి** రాష్ట్రంలో జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీని తిరిగి ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసిందని, రేషన్ డీలర్లు ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెట్టి, కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరుకులు పంపిణీ చేయాలని ఆయన కోరారు. జూన్ 1న పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న సన్నాహాలను పరిశీలించేందుకు మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం విజయవాడలో పర్యటించారు.



మధురానగర్‌లోని 218వ నంబర్ రేషన్ దుకాణంలో నిర్వహించిన ట్రయల్ రన్‌ను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయ

2లో..

## మేడిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

# అన్న ప్రసాధ వితరణ

**-మాతృ అభయ ఫౌండేషన్ అనాధ పిల్లలకు అన్న ప్రసాదం**

**-లయన్స్ క్లబ్ అధ్యక్షులు వేముల కేశవ నాదం గౌడ్ ఆధ్వర్యంలో వితరణ**











**అక్షర శోధన న్యూస్ : మే 30 మేడిపల్లి** మేడిపల్లి మండల లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ వేముల కేశవనాదం గౌడ్ ఆధ్వర్యంలో మేడిపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ప్రక్కన ఉన్నటువంటి మాతృ అభయ ఫౌండేషన్ అనాధ ఆశ్రమ పిల్లలకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించగా.. లయన్ మనిచర్ల లావణ్య బంధువులు పావని వాళ్ల తండ్రి కీర్తిశేషులు వీఆర్వి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ మేరకు అధ్యక్షులు లయన్ వేముల నాదం గౌడ్ మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాలుగా మేడిపల్లి లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈరోజు మాతృ అభయ ఫౌండేషన్ విద్యార్థిని విద్యార్థులకు ఈ అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషం ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన లావణ్య వారి బంధువులు పావని తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం ఈ విద్యార్థిని విద్యార్థులకు ఏదో ఒక విధంగా సహాయ సహకారాలు అందిస్తామని, ఈ కార్యక్రమానికి సహకరించిన మేడిపల్లి లయన్స్ క్లబ్ సభ్యులకు ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి లయన్ పల్లి బాలరాజు గౌడ్, లయన్ మనిచర్ల లావణ్య, లయన్ శారద, లయన్ సావిత్రి, లయన్ దుర్గ, లయన్ ప్రభాకర్, లయన్ పానుగంటి బృందాకర్ గౌడ్, అరుణ, వరలక్ష్మి, పరమేశ్వరి తదితరులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కమిషనర్ కార్యాలయం ప్రక్కనే


# కమర్షియల్ నిర్మాణాల జోరు

**- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు వారి సిబ్బంది**

**- రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు**

**- కమిషనర్, స్పెషల్ ఆఫీసర్ లు చర్యలు చేపట్టాలంటున్న స్థానికులు**



**అక్షర శోధన న్యూస్ : మే 30 మేడిపల్లి** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, స్పెషల్ ఆఫీసర్ కార్యాలయం ప్రక్కనే రెసిడెన్షియల్ పర్మిషన్ తో అక్రమంగా బహుళ అంతస్తుల కమర్షియల్ నిర్మాణాలు చేపడుతుంటే అదే దారిన వెళ్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు వారి సిబ్బంది మాత్రం పట్టించుకోకుండా రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతూ అమ్యమ్యాలకు అలవాటు పడుతూ.. ప్రజలకు ప్రభుత్వానికి కార్పొరేషన్ కు రావలసిన కోట్లది రూపాయల నిధిని అడ్డుకుంటున్నారు. ఈ మేరకు స్థానిక ప్రజలు స్పందిస్తూ.. కార్పొరేషన్ కార్యాలయానికి ఎడమవైపు రెసిడెన్షియల్ పర్మిషన్ తో కమర్షియల్ నిర్మాణాలు చేపడుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు వారి సిబ్బంది ఏం చేస్తున్నారని స్థానిక కమిషనర్, స్పెషల్ ఆఫీసర్లను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి కమిషనర్, స్పెషల్ ఆఫీసర్ లు అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపడుతూ.. టౌన్ ప్లానింగ్ అధికారులు వారి సిబ్బందిని పరిరక్షణకు పంపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ తో పాటు హైడ్రా కమిషనర్ కు కూడా దరఖాస్తు చేస్తామని స్థానికులు కోరుతున్నారు.

## బోడుప్పల్ గ్రీన్ ఫీల్డ్స్ కాలనీలో

# అక్రమ నిర్మాణాల జోరు

**- వార్తలు పట్టించుకోరు, ఫోన్లు లేపరు.. ఇది టౌన్ ప్లానింగ్ అధికారుల పరిస్థితి**

**- కొంతమంది రాజకీయ నాయకులు, బిల్డర్ల వెనకాల నిర్మాణాలు..**

**- పర్యవేక్షణ లేక అక్రమ నిర్మాణాలు చేపడుతున్న అక్రమార్కులు**

**- ఏసీలకే పరిమితం అవుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు,సిబ్బంది**

**- కమిషనర్, స్పెషల్ ఆఫీసర్ లు చర్యలు చేపట్టాలని కోరుతున్న స్థానిక ప్రజలు**



**అక్షర శోధన న్యూస్ : మే 29 మేడిపల్లి** బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్ గ్రీన్ ఫీల్డ్స్ కాలనీలో పాత ఇండ్ల మీద ఎలాంటి పర్మిషన్స్ లేకుండా మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదంతా కేవలం రాజకీయ నాయకుల కనుసన్నల్లో జరుగుతుందనేది సుస్పష్టం. కానీ నెలనెల జీతాలు తీసుకుంటున్న టౌన్ ప్లానింగ్ అధికారులు వారి సిబ్బంది ఏం చేస్తున్నారని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి అక్రమ నిర్మాణాల మీద చర్యలు చేపట్టి మున్సిపల్ ఆక్ట్ ప్రకారం 100% ఫైన్ రాసి మరొకరు మళ్ళీ తప్పు చేయకుండా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా బోడుప్పల్ కార్పొరేషన్ కమిషనర్, స్పెషల్ ఆఫీసర్ ఈ విషయాన్ని గమనించి టౌన్ ప్లానింగ్ అధికారులు వారి సిబ్బంది ఎందుకు పర్యవేక్షణ చేయడం లేదో అడగాలని, ఫీల్డ్ మీద పర్యవేక్షణ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కు కంప్లైంట్ చేయడమే కాకుండా హైడ్రాను కూడా సంప్రదిస్తామని స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు.

- బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రతిరోజు ఏదో ఒక విధంగా వార్తలు వస్తున్నప్పటికీ కనీసం విలువలు మర్చిపోయి.ఎం అమ్మమ్యాలకు అలవాటు పడి, కనీసం పర్యవేక్షణలు లేకుండా రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతూ.. ఎవరైనా ప్రజలు గాని విలేకరులు గాని ఫోన్లు చేసినట్లయితే కనీసం ఫోన్లు లేపని టౌన్ ప్లానింగ్ అధికారులు వారి సిబ్బంది. కాబట్టి స్థానిక కమిషనర్, స్పెషల్ ఆఫీసర్లు పై విషయాన్ని పురస్కరించుకొని పర్యవేక్షణ చేసి మున్సిపల్ ఆక్ట్ ప్రకారం చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ట్రంప్‌కు భయపడి యుద్ధం ఆపారు

పీకేస్తామని చైనాను ఇందిరాగాంధీ హెచ్చరించారు. నాడు యుద్ధం ఆపాలని అమెరికా అధ్యక్షుడు బెదిరించినా ఇందిరా గాంధీ లొంగలేదు. అలాంటి యుద్ధతంత్రాన్ని ప్రజలు నేటికీ గుర్తు చేసుకుంటున్నారు" అని అన్నారు. పాకిస్థాన్‌కు సరైన గుణపాఠం చెప్పాలంటే సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)ను స్వాధీనం చేసుకోవాలని తాము మోదీకి సూచించామని తెలిపారు. 1971 యుద్ధంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాకిస్థాన్‌ను ఓడించిందని గుర్తుచేశారు. "మేం నిర్వహించిన ఈ యాత్ర ఎన్నికలు, ఓట్ల కోసం కాదు. సైనికుల ఆత్మస్థైర్యం, దేశ ఆత్మగౌరవం నిలబెట్టడం కోసం. బలూచిస్థాన్‌ను విడగొట్టి మరో దేశంగా చేయమంటే అది చేతకాదు కానీ, కాంగ్రెస్‌ను విమర్శిస్తారు. యుద్ధంలో ఎన్ని రఫేల్ విమానాలు నేలకూలాయో లెక్క చెప్పాలి" అని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. పాకిస్థాన్‌ను ఓడించాలంటే ఇందిరాగాంధీ మార్గంలో నడవాలని ప్రధానికి హితవు పలికారు. దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని, ప్రధాని మోదీ కాలం చెల్లిన రూపాయి అని వ్యాఖ్యానించారు. ఈ జై హింద్ యాత్ర బాచుపల్లి వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకు సాగింది. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కుట్ర చేసి కొడంగల్‌లో తనను ఓడించినా, 14 రోజుల్లోనే మల్కాజ్‌గిరి ప్రజలు ఎంపీగా గెలిపించారని, ఆ తర్వాత తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ప్రజల ముందుకొచ్చానని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.

## మన జెండా పీకేస్తాం అన్నోళ్లు

# అడ్రస్ లేకుండా పోయారు

పెట్టింది మన బ్రాండ్ సీబీఎన్. అప్పుడు ఐటీ, ఇప్పుడు ఏఐ. అప్పుడు హైటెక్ సిటీ, ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ. అప్పుడు సైబరాబాద్, ఇప్పుడు అమరావతి. అప్పుడు రూ.200 పెన్షన్ ను రూ. రెండు వేలు చేసింది మన సీబీఎన్, ఇప్పుడు పెన్షన్ ను రూ.నాలుగు వేలు చేసింది కూడా మన సీబీఎన్. అన్న క్యాంటీన్లు, డ్వాక్రా, దీపం, పేదల చిరునవ్వు మన సీబీఎన్. సీబీఎన్ అంటే డెవలప్మెంట్, సీబీఎన్ అంటే సంక్షేమం, సీబీఎన్ అంటే మానవత్వం.

మన నాయకులు ట్రెండ్ ఫాలో అవ్వరు ట్రెండ్ సెట్ చేస్తారు. సినిమా స్క్రీన్ అయినా పొలిటికల్ స్క్రీన్ అయినా ఆయనే లెజెండ్. ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు ఒక ప్రభంజనం. ఆయనే రాముడు, ఆయనే కృష్ణుడు, ఆయనే భీముడు, ఆయనే అర్జునుడు, ఆయనే కర్ణుడు, ఆయనే ప్రజల గుండెల్లో దేవుడు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నారు. ప్రధాని మోదీ మన రాష్ట్రానికి పూర్తి సహకారం అందిస్తున్నారు. మనం అడిగిన ప్రతి కోరిక తీరుస్తున్నారు. మనకు అహంకారం ఉండకూడదు, అహంకారం విర్రవీగిన గత పాలకుల 151 సీట్లు 11 అయ్యాయి. అందుకే నేల మీద ఉండి ప్రజలకు సేవ చెయ్యాలి. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్టు పనిచేయాలి. చిన్న కుటుంబంలోనే సమస్యలు ఉంటాయి. కూటమి అన్న తరువాత చిన్న చిన్న సమస్యలు ఉండటం సహజం. ఇగోలు పక్కన పెట్టి అందరిని కలుపుకొని పనిచేయాలి. రాసి పెట్టుకోండి విడాకులు ఉండవు. రాష్ట్రం బాగుపడాలి, ప్రజలు సంతోషంగా ఉండాలి అంటే మనం కలిసి ఉండాల్సిందే అని నారా లోకేశ్ వివరించారు.

# ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

సుప్రీంకోర్టు ఆయనకు చాన్సిచ్చింది. పాస్ పోర్టు ఇవ్వాలని కేంద్రం ఆదేశించింది. మూడు రోజుల్లో ప్రభాకర్ రావు ఇండియాకు రానున్నారు. ఇప్పటికే శ్రవణ్ రావు అనే మరో నిందితుడు కూడా ఇండియాకు వచ్చారు. అయనను పలుమార్లు ప్రశ్నించారు. వేరే కేసులో అరెస్టు చేశారు. గతంలో వీరిద్దరూ ఇండియాకు వచ్చిన మరుక్షణం కేసీఆర్ ను అరెస్టు చేస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. వీరిని బీజేపీ కాపాడుతోందని ఆరోపించారు. ఇప్పుడు ఆ ఇద్దరిలో ఒకరు వచ్చేశారు మరొకరు వస్తున్నారు. ట్యాపింగ్ కేసులో అంతా ప్రభాకర్ రావు , కేసీఆర్ చెప్పినట్లే చేశామని ఇతర నిందితులు చెప్పారు. చాలా కాలం అరెస్ట్ అయి వారంతా బెయిల్ పై బయటకు వచ్చారు. ఇప్పుడు ప్రభాకర్ రావు చెప్పే విషయాలు కీలకం కానున్నాయి.

# రేషన్ డీలర్లూ.. నమ్మకాన్ని నిలబెట్టండి

ప్రాంగణంలో పౌరసరఫరాల శాఖ ఏర్పాటు చేసిన చౌకధరల దుకాణాల ఈ-పాస్, వెయింగ్ మెషీన్ల సేవా శిబిరాన్ని పౌరసరఫరాల కమిషనర్ సౌరభ్ గౌర్‌తో కలిసి మంత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ రేషన్ డీలర్లతో మంత్రి మనోహర్ మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అందుకే రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని మళ్లీ చేపడుతున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు వారి ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. "గతంలో రేషన్ డీలర్లు కార్డుదారుల కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉండి సేవలు అందించారు. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో, మనసుపెట్టి పనిచేసి కార్డుదారులకు గౌరవంగా సేవలు అందించాలి," అని మంత్రి సూచించారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు, ఆదివారాల్లో కూడా రేషన్ దుకాణాలు తెరిచి ఉంచి సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఐదో తేదీలోపే దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇంటివద్దకే సరుకులు చేరేలా డీలర్లు చొరవ చూపాలని కోరారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందించడం ద్వారా కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడవచ్చన్నారు. ఒకవేళ సాంకేతిక సమస్యలు తలెత్తినా, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరుకుల పంపిణీ ఆగకుండా చూడాల్సిన బాధ్యత డీలర్లపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా రేషన్ డీలర్లు పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. రేషన్ దుకాణాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, సరైన తూకంతో సరుకులు పంపిణీ చేయాలని, ధరలు, స్టాక్ వివరాల బోర్డులను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. ఈ-పాస్, వెయింగ్ మెషీన్ల మరమ్మతుల కోసం ఏర్పాటు చేస్తున్న సర్వీస్ క్యాంపులను సద్వినియోగం చేసుకుని, సరుకుల పంపిణీకి సర్వసన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీఎస్‌వో ఎ.పాపారావు, ఏఎస్‌వోలు, పౌరసరఫరాల శాఖ డీటీలు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ కొనుగోళ్ల జాప్యంపై

# ఎయిర్ చీఫ్ మార్షల్ తీవ్ర ఆందోళన

అని ఆయన సూటిగా ప్రశ్నించారు.తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ) తేజస్ ఎంకే1ఏ కార్యక్రమాన్ని ఉదాహరణగా చూపుతూ, 2021 ఫిబ్రవరిలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)తో రూ. 48,000 కోట్ల విలువైన ఒప్పందం కుదిరినప్పటికీ, ఆర్డర్ చేసిన 83 విమానాల్లో ఒక్కటి కూడా ఇప్పటివరకు అందలేదని ఆయన తెలిపారు. వాస్తవానికి, వీటి డెలివరీ 2024 మార్చిలోనే ప్రారంభం కావాల్సి ఉంది. "తేజస్ ఎంకే1 డెలివరీలు ఆలస్యమయ్యాయి. తేజస్ ఎంకే2 నమూనా ఇంకా బయటకు రాలేదు. 'అమ్కా' స్టెల్త్ యుద్ధ విమానానికి సంబంధించి కూడా ఇంకా నమూనా సిద్ధం కాలేదు" అని ఎయిర్ చీఫ్ మార్షల్ వివరించారు."మనం కేవలం భారత్‌లో తయారు చేయడం గురించే కాదు. డిజైనింగ్ గురించి కూడా మాట్లాడాలి. దళాలకు, పరిశ్రమలకు మధ్య నమ్మకం ఉండాలి. మనం చాలా పారదర్శకంగా ఉండాలి. ఒకసారి దేనికైనా కట్టుబడితే, దాన్ని అందించాలి. మేక్ ఇన్ ఇండియా కోసం వాయుసేన తన వంతు కృషి చేస్తోంది" అని ఆయన అన్నారు. "భవిష్యత్తుకు సిద్ధంగా ఉండాలంటే, మనం వర్తమానానికి కూడా సిద్ధంగా ఉండాలి. పదేళ్లలో పరిశ్రమల నుంచి మనకు ఎక్కువ ఉత్పత్తి రావచ్చు. కానీ ఈ రోజు మనకు అవసరమైనవి ఈ రోజే కావాలి. మనం తక్షణమే కార్యాచరణను వేగవంతం చేయాలి. మన దళాలను శక్తిమంతం చేయడం ద్వారానే యుద్ధాల్లో గెలుస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.సీఐఐ వార్షిక వాణిజ్య సదస్సులో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా పాల్గొన్న కార్యక్రమంలో ఎయిర్ చీఫ్ మార్షల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఇంకా మాట్లాడుతూ, "'ఆపరేషన్ సిందూర్' అనేది దేశానికి దక్కిన గొప్ప విజయం. దీనిని అత్యంత ప్రణాళికాబద్ధంగా, వృత్తి నైపుణ్యంతో అమలు చేశాం. మేము సత్య మార్గంలో నడిచాం. అందుకే దైవం కూడా మాకు అండగా నిలిచాడని నేను నమ్ముతున్నాను" అని తెలిపారు.ఈ కచ్చితమైన దాడుల ద్వారా భవిష్యత్ రక్షణ అవసరాలు, వ్యూహాలపై భారత్‌కు స్పష్టమైన అవగాహన ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. "యుద్ధ స్వరూపం నిరంతరం మారుతోంది. ప్రతిరోజూ నూతన సాంకేతికతలు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రస్తుతం మన యుద్ధ తంత్రాలలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. 'ఆపరేషన్ సిందూర్' మనం భవిష్యత్తులో ఏ దిశగా పయనించాలో, మనకు ఎలాంటి వనరులు అవసరమో స్పష్టం చేసింది. అందువల్ల, మన ఆలోచనా విధానంలో కూడా మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా ఇప్పటికే కృషి జరుగుతోంది. ఇప్పటివరకు ఎదురైన సవాళ్లను విజయవంతంగా అధిగమించగలిగాం కాబట్టి, భవిష్యత్తులో కూడా దేశానికి అవసరమైన సేవలు అందిస్తామని నేను విశ్వసిస్తున్నాను" అని అమర్ ప్రీత్ సింగ్ వివరించారు."మనం ఎలాంటి కార్యకలాపాలు చేపట్టినా, వాయుశక్తి లేకుండా చేయలేం. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా ఇది చాలా బాగా నిరూపితమైంది" అని అన్నారు. "అధునాతన మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ)లో ప్రైవేటు పరిశ్రమల భాగస్వామ్యానికి కూడా అనుమతి లభించింది. ఇది చాలా పెద్ద ముందడుగు. ప్రైవేటు పరిశ్రమలపై దేశానికి ఉన్న విశ్వాసానికి ఇది నిదర్శనం. భవిష్యత్తులో మరిన్ని పెద్ద విషయాలకు ఇది మార్గం సుగమం చేస్తుందని నేను కచ్చితంగా నమ్ముతున్నాను" అని ఆయన పేర్కొన్నారు. కేవలం భారతదేశంలో ఉత్పత్తి చేయడం గురించి మాత్రమే కాకుండా, భారతదేశంలోనే రూపకల్పన చేయడం, అభివృద్ధి చేయడం కూడా ప్రారంభించాలని ఆయన పిలుపునిచ్చారు.

### కాకాణి కుటుంబాన్ని పరామర్శించిన

# అనిల్ కుమార్ యాదవ్



**నెల్లూరు** మాజీమంత్రి కాకాని గోవర్ధన్రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి వైసీపీ పీఏసీ సభ్యులు అనిల్కుమార్ యాదవ్ పరామర్శించారు. నెల్లూరు నగరంలోని కాకాని నివాసానికి వెళ్ళి పరామర్శించారు. క్లీన్చిట్తో గోవర్ధన్ రెడ్డి జైలు నుంచి బయటికి వస్తారని ధైర్యం చెప్పారు. కాకాని కుటుంబానికి వైఎస్సార్కాంగ్రెస్ పార్టీ అండగా ఉందని భరోసా ఇచ్చారు.

### ఇసుక లారీలను నియంత్రించడంలో

# అధికారులు విఫలం

### -సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్




**మంథని** ఇసుక లారీలను నియంత్రించడంలో అధికారులు విఫలం చెందారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ అన్నారు.మంథని మండలం గద్దలపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఇసుక లారీ ప్రమాదానికి గురి కాగా గురువారం సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు ప్రమాద సంఘటన స్థలం వద్ద గ్రామస్తులతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ అడవి సోమనపల్లి క్వారీకి వెళ్లే ఇసుక లారీ దారితప్పి ఖమ్మం పల్లి ఇసుక క్వారీకి వెళ్లడం జరిగిందని అక్కడ ఇసుక లోడ్ చేయకపోవడంతో తిరుగు ప్రయాణంలో డ్రైవర్ మద్యం మత్తులో ఉండి అధిక స్పీడుతో వెళ్లడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. ప్రమాదం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో జరిగిందని ఆ సమయంలో జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని లేకపోతే పెద్ద మొత్తంలో ప్రాణ నష్టం జరిగేదని అన్నారు. రాత్రి సమయంలో ఇసుక లారీలు నడపరాదని నిబంధనలు ఉన్నప్పటికీ మంథని నియోజకవర్గంలో రాత్రి సమయంలో విచ్చలవిడిగా ఇసుక రవాణా జరుగుతుందని అన్నారు. డ్రైవర్లు మద్యం సేవించి అధిక లోడుతో అధిక వేగంతో నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఇసుక లారీలను నియంత్రించడంలో సంబంధిత అధికారులు విఫలం చెందారని మంథని నియోజకవర్గం లో విచ్చలవిడిగా ఇసుక మాఫియా కొనసాగుతుందని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ తో పాటు గ్రామస్తులు అడ్డూరి రాజయ్య, అడ్డూరి సంపత్, ముత్యాల దుర్గయ్య, రాజేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

### సరస్వతి పుష్కర ఆదాయం

# రెండు కోట్ల 83 లక్షలు




**జయశంకర్ భూపాలపల్లి** సరస్వతి నది పుష్కరాల సందర్భంగా శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయానికి పుష్కరాలు 12 రోజులలో హుండీ ద్వారా రు.1,36,28,099 ఆదాయం వచ్చినట్లు హుండీల పర్యవేక్షణాధికారి నందనం కవిత తెలిపారు.

లెక్కింపు కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఎస్ మహేష్, సహాయ కమిషనర్ ఆర్ సునిత పాల్గొన్నారు. గదుల అద్దె ద్వారా రు. 1,71,000, హోమముల ద్వారా రు.1,23,000, శీఘ్రదర్శనం ద్వారా రు. 5,60,000, ప్రసాదముల ద్వారా రు.138,36,552, హుండీల ఆదాయం రు. 1,36,28,099, మొత్తం రు. 2,83,18,651, మిశ్రమ బంగారు 15 గ్రాములు, మిశ్రమ వెండి 1-750 గ్రాములు వచ్చినట్లు పర్యవేక్షణాధికారి నందనం కవితవెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, పుష్కరాల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ఆపరేషన్ కగారు నిలిపి వేయాలంటూ

# కరపత్రం ఆవిష్కరణ



**నర్సంపేట** మధ్య భారత ఆదివాసులపై జరుగుతున్న ఎన్కౌంటర్ లు నిలిపి వేయడంతో పాటు ఆపరేషన్ కగారును ఆపాలని గురువారం నర్సంపేట సిపిఐ ఎం ఎల్ పార్టీ కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు మోడెమ్ మల్లేష్ మాట్లాడుతూ, చత్తిస్ ఘడ్ ఆది వాసులపై ఉక్కు పాదం మోపి ఆటవి ఖనిజ సంపద బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని ఆరోపించాడు.ఆపరేషన్ కగారుకు వ్యతిరేకంగా జూన్ 1న సిటిజన్ క్లబ్లో జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరాడు. ఈ కార్యక్రమంలో బొర్ర ఆనంద్, ఈర్ల పైడి, భూమా అశోక్, ఈరెల్లి రాంచందర్, శివరాతి కుమారస్వామి, బర్ల గౌరన్న, కడారి సురేష్, కొమ్ముక రవి, భానోత్ రాజు, భానోత్ బాలు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా

# జాగ్రత్త తీసుకోవాలి

### - మంథని డి ఎల్ పి ఓ కొమ్మెర సతీష్.



**కమాన్ పూర్** ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందాసు జాగ్రత్తలు తీసుకోవాలి అని మందని డివిజనల్ పంచాయతీ అధికారి కొమ్మెర సతీష్ అన్నారు.
కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామంలో గురువారం మంథని డివిజనల్ పంచాయతీ అధికారి కొమ్మర సతీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులను, పారిశుద్ధ్య పనులను పరిశీలించి, గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఎటువంటి నిర్మాణ పనులు చేయరాదు అని హెచ్చరించడం జరిగింది. వర్షాకాల దృష్ట్యా సీషనల్ వ్యాదుల ప్రబలకుండా పారిశుద్ధ్య పనులను నిరంతరం సక్రమంగా చేయవలెనని, గ్రామ పంచాయతీ మల్టిపర్పస్ సిబ్బందికి ఆదేశించనైనది. గ్రామంలో నిరంతరం గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటా చెత్త సేకరణ జరిపి సెగ్రిగేషన్ షెడ్ లో తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి నాణ్యమైన సేంద్రియ ఎరువు తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శికి మల్టిపర్పస్ సిబ్బందికి తగు సూచనలు జారీ చేసినారు. వైకుంఠధామం, నర్సరీని సందర్శించి వాటరింగ్ సక్రమంగా చేయుట, నీటి ఎద్దడి లేకుండా చూడవలసిందిగా ఆదేశించారు.

జూలపల్లి పంచాయతీ సమీపంలోని మంచి నీటి వాటర్ ట్యాంకును పరిశీలించి, ట్యాంకును ఎప్పటికప్పుడూ శుభ్రపరచి క్లోరినేషన్ చేయవలసినదిగా ఆదేశించినారు. ఎస్ బి ఎం లో బాగంగా జూలపల్లి గ్రామంలో ప్రతి రోజు 20 మందికి తగ్గకుండా గ్రామ వాసులు ఎస్ బి ఎం - అకడమిక్ ట్రేనింగ్ ద్వారా సర్టిఫికెట్ పోందవలెనని పంచయాతీ కార్యదర్శి కి ఆదేశించనైనది. తదుపరి సింగరేణి సంస్థ నుండి జూలపల్లి గ్రామ పంచాయతీకి రావలసిన ఇంటి పన్నులను సత్వరమే సింగరేణి అధికారులను పంచాయతీ కార్యదర్శి సంప్రదించి త్వరగా వసూలు చేయవలసినగా ఆదేశించనైనది. వారి వెంట పంచాయతీ కార్యదర్శి అంబటి శంకర్, గ్రామ పంచాయతీ మల్టిపర్పస్ సిబ్బంది పాల్గొన్నారు.

### జూన్ ఒకటి నుండి రేషన్ షాపుల్లో

# రేషన్ పంపణీకి సర్వం సిద్ధం

### - నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాల శాఖ మంత్రి



**విజయవాడ :** కార్డుదారుల సౌలభ్యం కోసం జూన్ ఒకటో తేది నుండి రేషన్ షాపుల ద్వారా రేషన్ సరుకులు పంపిణీకి సర్వం సిద్ధం అని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. యండి యు విధానం అమలులో ఉన్నపుడు ఈ పోస్లో ఉన్న సాఫ్ట్వేర్ను తొలగించి రేషన్ డీలర్ ద్వారా పంపిణీ కోసం రూపొందించిన సాఫ్ట్వేరు క్షేత్ర స్థాయిలో పరిశీలించే నిమిత్తం విజయవాడ మధురానగర్ రేషన్ డిపో నెంబరు 218ని పౌరసరఫరాశాఖ కమిషనర్ సౌరబ్తో కలిసి సందర్శించారు. ఈపోస్లో లాగిన్ నుండి కార్డు నెంబరు ఎంటర్ అయ్యే విధానం కార్డుదారుని వేలిముద్ర, కంటిపాప ద్వారా సరుకులు నమోదయ్యే విధానం పరిశీలిం చారు.
అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో యుండియు వాహనం ఎపుడు వస్తుందో వెళుతుందో తెలియని దుస్తితి ఉందని దీంతో కార్డుదారులు రేషన్ కోసం వాహనం కోసం రోడ్ల మీద తిరగాల్సిన పరిస్థితి ఉందని ఇపుడు కార్డుదారులకు ఆ కష్టాలు ఉండవని చె ప్పారు. నెలలో ఒకటో తేది నుండి 15వ తేది వరకు ఉదయం 8 నుండి మధ్యహ్నం 12 వరకు సాయంత్రం నాలుగు నుండి 8 గంటల వరకు రేషన్ దుకాణంలో సరుకులు తీసుకోవచ్చని చె ప్పారు.65 సంవత్సరాలు దాటిన ఒంటరి వృద్ధులు, వికలాంగులు, భార్యభర్తలు ఇద్దరు వృ ద్ధులైన వారి జాబితాలు రేషన్ షాపుల వారికిగా సిద్ధం చేశామని వారికి 1 నుండి 5వ తేదిలోగా డీలర్ ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు ఇస్తారని చెప్పారు.

ఇల్లు మారి వేరే ప్రాం తాలకు వెళ్లిన వారికి కూడా పోర్టబిలిటీ విధానం ద్వారా సమీప రేషన్ దుకాణంలో రేషన్ పొం దవచ్చని చెప్పారు. రేషన్ దుకాణాలలో అవినీతి జరగకుండా ప్రభుత్వం సరికొత్తయాప్ను రూపొందించిందని చెప్పారు. ఈ యాప్లో డీలర్ వివరాలు ఫోటోతో సహా వస్తాయన్నారు. యంఎల్ఎస్ పాయింట్ నుండి సరుకు ఎంత వచ్చింది. కార్డుదారులకు ఎంత పంపిణీ చేశారనే వివరాలు, రేషన్ దుకాణం వద్ద జనం ఎక్కువ మంది ఉన్నా వెంటనే ఈ యాప్ ద్వారా తెలిసిపోతుందని చెప్పారు.

### అమీర్పేటలో దూసుకొచ్చిన బస్సు..

# హోంగార్డుకు గాయాలు

**హైదరాబాద్** ట్రావెల్స్ బస్సు దూసుకురావడంతో హోంగార్డుకు గాయాలైన ఘటన అమీర్పేటలో గురువారం జరిగింది. స్థానికుల వివరాలు.. పిల్లర్ నంబర్ 1078 ఎదురుగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సు విధుల్లో ఉన్న ట్రాఫిక్ హోంగార్డ్ బైక్ను ఢీ కొట్టింది. బస్సు కింద బైక్ ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో హోంగార్డుకు గాయాలవగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### జీహెచ్ంఎసిలో అవినీతి

# తారాస్థాయికి చేరుకుంది

**హైదరాబాద్** సిసి రోడ్లు వేయకుండానే, రోడ్లు వెసినట్లు చూయించి, 9లక్షలు బిల్లులు మంజూరు చేయించిన విషయం పై జీహెచ్ంఎసి కమిషనర్ కర్ణన్ కు ఫిర్యాదు చేసామని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ అన్నారు.

ఫిర్యాదు చేసి వారం రోజులు గడుస్తున్నా, సంతోష్ నగర్ జీహెచ్ంఎసి సర్కిల్ ఇంజనీర్ డిపార్ట్మెంట్ విభాగం పై ఇప్పటికి చర్యలు తీసుకోకుండా విజిలెన్స్ అధికారులు రిపోర్ట్ తీస్కుకోకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ , జీహెచ్ంఎసి చార్మినార్ జోనల్ ఆఫీస్ ముందు కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ లతో పాటు పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు కార్యకర్తలు ధర్నా నిర్వహించారు.

# మహారాణా ప్రతాప్ జయంతి

**హైదరాబాద్:** మహారాణా ప్రతాప్ జయంతిని పురస్కరించుకొని ఆసిఫ్ నగర్ డివిజన్ లో బిజెపి సెంట్రల్ జిల్లా స్పోక్స్ పర్సన్ రవికుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక యువత ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని రక్త దానం చేశారు. ప్రమాద సమయాలలో ఎంతోమంది రక్తమంధక మృతి చెందుతున్నారని అలాంటి వారికోసం ఈ రక్తదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు రవి తెలిపారు.

### జవహర్ నగర్ కాలనీలో

# పర్యటించిన ఎమ్మెల్యే గండ్ర

- కాలనీలో జై బాపూ, జై భీమ్, జై సంవీధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహణ..
- జవహర్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే.
- మంచినీటి సరఫరా మోటారును స్విచ్ఛాన్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే..



**జయశంకర్ భూపాలపల్లి** భూపాలపల్లి పట్టణంలోని 8, 27 వార్డులైన జవహర్ నగర్ కాలనీ లో కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై భీమ్, జై బాపూ, జై సంవీధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో గురువారం ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు కాలనీ వాసులు, నాయకులు శాలువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం బాపూ, అంబేద్కర్, రాజ్యాంగ పీఠిక చిత్రపటాలకు పూల మాల వేసి, అక్కడున్న నాయకులు, ప్రజలతో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం యాత్రనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ... మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. అమిత్ షా అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. కాలనీలో యాత్ర మధ్యలో పలువురు కాలనీవాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని అక్కడున్న మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.జవహర్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే..జవహర్ నగర్ కాలనీలో పాదయాత్ర మధ్యలో కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై నుండి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దొడ్డు బియ్యం పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టడంతో పాటు పేదలకు సన్న బియ్యం అందించాలనే కృతనిశ్చయంతో ప్రజా ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. సన్న బియ్యం పంపిణీ దేశంలోని ఆదర్శ పథకం అని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ఆలోచన విధానంలో మార్పు వచ్చినప్పుడు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని అన్నారు.పోచమ్మ ఆలయంలో మంచి నీటి బోరు మోటారును స్విచ్ఛాన్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే జవహర్ నగర్ కాలనీలో పాదయాత్రలో భాగంగా కాలనీలోని పోచమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మున్సిపల్ నిధులు రూ.2 లక్షల వ్యయంతో వేసిన మంచి నీటి బోరు మోటారును స్విచ్ఛాన్ చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు మంచి నీటి ఇబ్బంది లేకుండా చూడటమే తన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్దే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, అధికారులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న నటి శ్రీయ

**తిరుమల** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ కథానాయకి శ్రీయ శరణ్ దర్శించుకున్నారు. గురువారం ఉదయం శ్రీవారిని సుప్ర భాత సేవలో దర్శించుకొని ముక్కు లు చెల్లించుకున్నారు. దర్శనానం తరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితుల వేద ఆశీర్వచనం అందించారు ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్క రించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### బ్రహ్మంగారిమఠం మండలం నుండి

# భారీగా తరలి వెళ్లిన టిడిపి శ్రేణులు

### – ప్రతి గ్రామము నుండి మహానాడుకు వెళ్ళిన ప్రజలు ,కార్యకర్తలు



**బ్రహ్మంగారిమఠం** మహానాడులో భాగంగా కడపలో మూడో రోజు జరుగుతున్న భారీ బహిరంగ సభకు బ్రహ్మంగారి మఠం మండలం లోని అన్ని గ్రామాల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు ఈ మహానాడు కార్యక్రమానికి మైదుకూరు నియోజకవర్గం శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఇచ్చిన పిలుపునందుకొని బ్రహ్మంగారిమఠం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు ముడుమాల పోల్ రెడ్డి ఎస్ ఆర్ శ్రీనివాసులురెడ్డి మల్లికార్జునరెడ్డి సాంబశివారెడ్డి పూజా శివ యాదవ్ సుధాకర్ యాదవ్ తదితర నాయకుల ఆధ్వర్యంలో గ్రామ గ్రామము నుండి తెదేపా నేతలు బహిరంగ సభకు తరలి వెళ్లారు ఉదయం 8 గంటలకే మండలంలోని అన్ని గ్రామాలకు తెదేపా నేతలు బస్సులను పంపగా బస్సులలో బయలుదేరి తరలి వెళ్లారు వారితోపాటు పచ్చ జెండాలు బ్యానర్లు పెద్ద ఎత్తున ప్రదర్శన చేసుకుంటూ తరలి వెళ్లారు మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ఎవరికి వారు తమ అధినేత పుట్టా సుధాకర్ యాదవ్ ఇచ్చిన పిలుపునకు స్పందించి వేలాదిమంది కార్యకర్తలను తరలించడంలో సఫలీకృతులయ్యారని చెప్పొచ్చు మండలంలో కందిమల్లాయపల్లె కొత్తూరు నరసన్న పల్లె సోమిరెడ్డి పల్లె గంగిరెడ్డిపల్లి మల్లేపల్లి చెంచయ్య గారి పల్లె ముడమల పంచాయతీ పలువురాలపల్లె పంచాయతీ ఇలా మండలంలోని 11 పంచాయతీలలోని అఅన్ని గ్రామాల నుంచి తెదేపా అభిమానులు కార్యకర్తలు ప్రజలు నందమూరి అభిమానులు కడపకు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు



# వరుస ఫ్లాపులు..

## – రెమ్యునరేషన్ తగ్గించుకున్న శ్రీలీల!

దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో మేక రోషన్ హీరోగా తెరకెక్కిన 'పెళ్లి సందD' సినిమాతో హీరోయిన్‌గా తెలుగులో ఎంట్రీ ఇచ్చింది శ్రీలీల. అమెరికాలో పుట్టిన శ్రీలీల డాక్టర్ చదువుతుండగానే సినిమాల్లోకి వచ్చేసింది. తొలి సినిమాతోనే తెలుగు కుర్రకారు మనసులు దోచుకున్న ఈ చిన్నది ఆరు నెలలు తిరగకముందు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది. ధమాకా, గుంటూరు కారం, స్కంద, భగవంత్ కేసరి, ఆదికేశవ, ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్‌హుడ్ చిత్రాల్లో నటించింది. కెరీర్ తొలినాళ్లలో రెండు మూడు హిట్లు కొట్టిన ఈ బ్యూటీ ఆ తర్వాత వరుస ఫ్లాపులతో వెనకబడిపోయింది.ప్రస్తుతం పవన్ కళ్యాణ్ సరసన 'ఉస్తాద్ భగత్‌సింగ్'లో నటిస్తోన్న శ్రీలీల తెలుగులో మంచి హిట్ కోసం ఎదురుచూస్తోంది. అలాగే మాస్ మహరాజ్ రవితేజతో 'మాస్ జాతర', అఖిల్ అక్కినేనితో 'లెనిన్'లో నటిస్తోంది. మరోవైపు తమిళంలో శివ కార్తికేయన్ సరసన 'పరాశక్తి'లోనటిస్తోంది. బాలీవుడ్‌లోనూ అవకాశాలు దక్కించుకుంటూ టాప్ హీరోయిన్‌గా ఎదిగేందుకు చాలా కష్టపడుతోంది.

### విడుదల తేదీ ప్రకటించిన

# రవితేజ 'మాస్ జాతర'

మాస్ మహారాజా రవితేజ ఇటీవల కాలంలో సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. 'ధమాకా' తర్వాత ఆయనకు పెద్ద హిట్ దక్కలేదు. గతేడాది విడుదలైన ఈగల్, మిస్టర్ బచ్చన్ చిత్రాలు ఆశించిన విజయాన్ని సాధించలేకపోయాయి. ఈ నేపథ్యంలో, రవితేజ ఎలాగైనా హిట్ కొట్టాలనే కసితో ఉన్నారు. ఈ క్రమంలోనే ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. ఈ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. రవితేజ సరసన శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. వీరిద్దరూ గతంలో 'ధమాకా'తో ప్రేక్షకులను విశేషంగా అలరించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మనదే ఇదంతా' అనే ట్యాగ్ లైన్‌తో వస్తున్న ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ తాజాగా ప్రకటించారు. ఈ సినిమాను వినాయక చవితి కానుకగా.. ఆగష్టు 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.




# ఓటీటీలోకి హారర్ థ్రిల్లర్ 'డీమన్'.. నేటి నుంచి ఆహాలో స్ట్రీమింగ్

తమిళంలో థ్రిల్స్, హారర్ అంశాలతో వచ్చి బ్లాక్ బస్టర్ అందుకున్న 'డీమన్' చిత్రం తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. రమేశ్ పళనీవేల్ దర్శకత్వంలో, నిర్మాత ఆర్. సోమసుందరం నిర్మాణంలో రూపొందిన ఈ చిత్రం, నేటి నుంచి భవాని మీడియా ద్వారా ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహాలో ప్రసారం కానుంది.సచిన్ మణి మరియు అబర్నతి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో, సురుతి పేరియసామి, కుంకి అశ్విన్, రవీనా కీలక పాత్రల్లో అదరగొట్టారు. ఈ సినిమా హారర్, సస్పెన్స్, మరియు ఊహించని ట్విస్టులతో కూడిన కథనంతో ప్రేక్షకులను ఉత్రూతలూగించబోతున్నది. ప్రతి మలుపు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా తీర్చిదిద్దినట్లు చిత్ర బృందం పేర్కొంది. "డీమన్" చిత్రానికి రోనీ రాఫెల్ అందించిన సంగీతం, ఆర్.ఎస్. ఆనందకుమార్ చేసిన ఛాయాగ్రహణం, మరియు రవికుమార్ ఎం. చేసిన ఎడిటింగ్ సినిమాను మరింత అద్భుతంగా తీర్చిదిద్దాయి. ఈ




### రెండోసారి తల్లి కాబోతున్న

# ఇలియానా



ప్రముఖ నటి ఇలియానా డి క్రూజ్ రెండోసారి తల్లి కాబోతుంది. ఇటీవల ఆమె తన బేబీ బంప్‌ను చూపిస్తూ అభిమానులతో ఈ శుభవార్తను పంచుకున్నారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఒక బ్లాక్ అండ్ వైట్ ఫోటోను షేర్ చేశారు. ఈ ఫోటోలో ఇలియానా తన గర్భిణి స్నేహితురాలితో కలిసి నవ్వుతూ, తమ బేబీ బంప్‌లను చూపిస్తూ కనిపించారు. ఈ ఫోటోకు ఆమె "బంప్ బడ్డీస్" అని క్యాప్షన్ ఇచ్చారు.ఇలియానా తన రెండవ గర్భం గురించి గత జనవరిలోనే పరోక్షంగా హింట్ ఇచ్చింది. ఆ తర్వాత ఫిబ్రవరిలో అర్ధరాత్రి తనకు కలిగిన కొన్ని కోరికలను చూపిస్తూ "మీరు గర్భవతి అని చెప్పకుండానే చెప్పండి" అని క్యాప్షన్ పెట్టి, తన రెండవ గర్భాన్ని ధృవీకరించారు. అప్పటి నుండి అభిమానులు ఆమె నుండి అధికారిక ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూ స్తున్నారు. ఇలియానా 2023లో మైఖేల్ డోలన్‌ను వివాహం చేసుకుంది. అదే సంవత్సరం ఏప్రిల్‌లో తన మొదటి గర్భాన్ని ప్రకటించింది. ఆ తర్వాత ఆగస్టులో ఆమె తన కుమారుడు కోవా ఫోనిక్స్ డోలన్‌కు జన్మనిచ్చారు. ప్రస్తుతం, ఇలియానా తన రెండవ బిడ్డ రాక కోసం ఆనందంగా ఎదురుచూస్తుంది. ఈ వార్తతో ఆమె అభిమానులు, సినీ వర్గాల నుండి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

# ఇన్‌స్టా లైక్‌పై స్పందించిన తమన్నా

ప్రస్తుతం సినీ పరిశ్రమలో దీపికా పదుకొణె, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మధ్య 'స్పిరిట్' సినిమాకు సంబంధించి జరుగుతున్న వివాదం తీవ్ర చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నటి తమన్నా భాటియా ఇన్‌స్టాగ్రామ్‌లో దీపికకు మద్దతుగా ఉన్న ఒక రీల్‌ను అనుకోకుండా లైక్ చేయడంపై వివరణ ఇచ్చింది. ఇది ఇన్‌స్టాగ్రామ్ లోపం వల్ల జరిగిందే తప్ప, తాను ఉద్దేశపూర్వకంగా లైక్ చేయలేదని ఆమె స్పష్టం చేశారు. ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కనున్న 'స్పిరిట్' చిత్రం నుంచి దీపికా పదుకొణె తప్పుకున్నారని గత కొన్ని రోజులుగా వార్తలు ప్రచారంలో ఉన్నాయి. దీనికి కారణం దీపిక పెట్టిన కొన్ని కఠినమైన షరతులేనని చెబుతున్నారు. రోజుకు ఆరు గంటలకు మించి షూటింగ్ చేయకపోవడం, అదనపు రోజులకు అదనపు పారితోషికం డిమాండ్ చేయడం వంటి షరతులు విధించారని సమాచారం. ఈ వివాదంపై సందీప్ రెడ్డి వంగా పరోక్షంగా దీపికను ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి.ఈ నేపథ్యంలో, మహిళలు వృత్తి జీవితంలో ఎదుర్కొనే లింగ వివక్ష, వేతన వ్యత్యాసాలు, అధిక పనిగంటల ఒత్తిడి వంటి అంశాలపై గతంలో దీపికా పదుకొణె తన ఆర్థిక స్వాతంత్ర్యం గురించి మాట్లాడిన ఒక పాత వీడియో క్లిప్‌తో కూడిన రీల్ ఒకటి ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అయింది.

ఈ రీల్‌కు తమన్నా భాటియా లైక్ చేయడం గమనార్హం. దీనితో తమన్నా దీపికకు మద్దతు ఇస్తున్నారని, ఈ వివాదంలో దీపిక వైపు నిలిచారని నెటిజన్లు, సినీ వర్గాలు భావించాయి.అయితే, ఈ లైక్ వెనుక ఉన్న అసలు కారణాన్ని తమన్నా భాటియా వెల్లడించారు. తాను ఉద్దేశపూర్వకంగా ఆ రీల్‌ను లైక్ చేయలేదని, అది అనుకోకుండా జరిగిందే అని స్పష్టం చేశారు. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక స్మైలింగ్ సెల్ఫీని షేర్ చేస్తూ, "ఇన్‌స్టాగ్రామ్ దానంతటదే పేజీలను ఎలా లైక్ చేస్తుందో అర్థం చేసుకోగలదా? ఎందుకంటే కొందరు వ్యక్తులు ఈ విషయాన్ని వార్తలుగా మార్చి నాకు నిజంగా పని ఉంది" అని రాసుకొచ్చారు. ఇన్‌స్టాగ్రామ్ అల్గారిథమ్ లోపం వల్లే ఇది జరిగిందని ఆమె పరోక్షంగా చెప్పకనే చెప్పారు.ఈ ఘటనతో తాను ఈ వివాదంలో ఎవరికీ మద్దతు ఇవ్వడం లేదని, కావాలనే ఆ రీల్‌ను లైక్ చేయలేదని తమన్నా తేల్చి చెప్పారు. ఈ ఘటనపై అనవసరమైన ఊహాగానాలు చేయవద్దని ఆమె కోరారు. గతంలో ఇలాంటి సంఘటనలు విరాట్ కోహ్లీ విషయంలోనూ జరిగాయని, అల్గారిథమ్ లోపాల వల్ల అనుకోకుండా లైక్‌లు పడతాయని గుర్తు చేస్తున్నారు.

